క్లుప్తంగా

మేయర్‌ను కలిసిన వీసీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్సలర్ ఆచార్య చింత సుధాకర్ సోమవారం కడప మేయర్ కె. సురేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంకు సంబంధించిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కేసీ బాదుల్లా ఆరోపించారు. సోమవారం నగరంలో హోచిమన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల అంగన్వాడీ, ఆయా కార్యకర్తల ప్రమోషన్ల పొందిన వాటిపై కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. ప్రొద్దుటూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అమృత నగర్‌లో సహాయకురాలు, అదే ప్రాజెక్టులోని అంగన్వాడీ కార్యకర్తకు పదోన్నతి కల్పించడానికి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రూ. లక్షలు తీసుకొని పదోన్నతి కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు సుబ్బరాయుడు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌ను పునరుద్ధరించాలి

కడప కార్పొరేషన్: కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న డా. బీఆర్ అంబేడ్కర్ భవన్‌ను మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, చైతల్య కోరారు. సోమవారం వారు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌కు వినతి పత్రమిచ్చారు. దళితులు సమావేశాలు, ఫంక్షన్‌లు, కోచింగ్‌లు తీసుకోవడానికి అనువుగా దాన్ని తీర్చిదిద్దాలని కోరారు.

బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని 48వ డివిజన్‌లో రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రామరాజుపల్లె సచివాలయం వద్ద రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని కోరుతూ నిరసన చేపట్టారు. బియ్యం పంపిణీ వ్యవస్థలో అధికారులు ప్రతి నెల సరైనా సమాచారం ఇవ్వకుండా బియ్యం ఇవ్వకుండా పేదల కడుపు కొడుతున్నారని తెలిపారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విశాఖపట్నంలో జూన్ 2,3,4 తేదీలల్లో జరిగే డీవైఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో డీవైఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు సమస్యలపై రాజకీయ శిక్షణ తరగతుల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ నాయకులు షాకీర్, ఓబులేసు, నరసింహులు పాల్గొన్నారు.

కాలువలో పూడిక తీయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని మాసాపేట, గరీబ్‌షా వీధిలోని మురికి కాల్వలలో పూడిక తీయాలని ఆర్‌సీపీ జోన్–2 నగర కార్యదర్శి తస్లీమ్ కోరారు. సోమవారం నగరంలోని మాసాపేటలోని వీధుల్లో మురికి కాల్వలో పూడిక తీయాలని కోరుతూ నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్‌కు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురికి కాల్వలో పూడిక తీయకపోవడం వల్ల డ్రైనేజీ నీరు సక్రమంగా పోవడం లేదన్నారు. ఆర్‌సీపీ నాయకురాళ్లు వెంకటేష్, చాంద్ బేగం, శోభారాణి, పర్వీన్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ విషయమై నగరంలోని ప్రభుత్వ గురుకుల ఐటీఐ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలాగా మహిళా క్రీడాకారులు బంగారు పతకాలను సాధిస్తుంటే వారికి అండగా నిలవాల్సింది పోయి లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. 22 రోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్ల క్రీడాకారులు ఆందోళన చేస్తుంటే వారికి మేధావులు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలుస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. డీవైఎఫ్ఐ నాయకుల జగదీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

చింతకొమ్మదిన్నె: కొత్తపేట–బుగ్గలేటిపల్లి సమీపంలోని గంగమ్మ తల్లి హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ ఈవో పి. సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణంలో నిర్వహించిన హుండీ ఆదాయం లెక్కింపులో 48 రోజులకు గాను రూ.2,63,901 లక్షలు వచ్చినట్లు ఈఓ తెలిపారు. హుండీలో కొన్ని బంగారు, వెండి నగలు ఉన్నాయని వివరించారు.

‘ఈత’రం పిడుగులు!

ఈత.. ఏ తరానికి చెందినవారికైనా మంచి ఉల్లాసమిస్తుంది. ఇక ఈతరం చిన్నారులకు మరింత ఉత్సాహమిస్తుంది. ఈత ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉండటంతో పాటు అనుకోని నీటి ప్రమాదాల నుంచి తనను తాను రక్షించుకునే ధైర్యమూ కలుగుతుంది. దీంతో ఈతపై చిన్నారుల్లో ఆసక్తి పెరుగుతోంది. వేసవి సెలవులు కావడంతో స్విమ్మింగ్‌పూల్స్ బాటపడుతున్న ‘ఈత’రం చిన్నారులపై కథనం.



కడప స్పోర్ట్స్ : జిల్లాలో భానుడి ప్రతాపం రోజురోజూకూ పెరుగుతోంది. దీంతో ప్రజలు, యువత, చిన్నారులు ఎండతీవ్రతను తట్టుకునేందుకు ఈతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పల్లె ప్రాంతాల చిన్నారులు ఈత కోసం చెరువులు, కాలువలు, నదులు, బావుల బాట పడితే... పట్టణప్రాంతాల్లో స్విమ్మింగ్ పూల్స్ చెంతకు చేరుతున్నారు. స్విమ్మింగ్ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించి స్లిమ్‌గా మార్చుతుంది. కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో, కడప ఆఫీసర్స్‌క్లబ్‌లో సైతం వేసవి శిక్షణ శిబిరం చక్కగా సాగుతోంది. ఉదయం 6.30 నుంచి 8.30 వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ నిర్వహిస్తున్నారు. శిబిరాల్లో భాగంగా వచ్చే చిన్నారులకు కోచ్‌లు, సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో శిక్షణ కొనసాగిస్తున్నారు. బాలికలకు మహిళా క్రీడాకారుల ఆధ్వర్యంలో నేర్పుతున్నారు. శిక్షకుల పర్యవేక్షణలో స్విమ్మింగ్‌తో పాటు అందులోని రకాలను నేర్చుకుంటున్నారు. భవిష్యత్ తరం మాదే.. ‘ఈత’రం చిన్నారులం మేమే నంటూ పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



స్విమ్మింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు..

- ఒక గంటపాటు స్విమ్మింగ్ చేస్తే 600 కిలో కేలరీలు పైగా కరుగుతాయి.
- చల్లని నీటితో రక్తప్రసరణ బాగా జరుగుతంది.
- కండరాలు ధృడంగా తయారవుతాయి.
- ఒత్తిడి అదుపులో ఉంటుంది.
- మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
- నడుము, తొడల వద్ద కొవ్వు కరుగుతుంది.
- అధికంగా ఆక్సిజన్ తీసుకోవడంతో శ్వాసక్రియ ప్రక్రియలో కార్బన్‌డయాక్సైడ్ ఎక్కువగా వదిలేయవచ్చు.
- మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది.
- మంచి శరీరాకృతి వృద్ధి చెందుతుంది.

సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకుంటా...



వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకోవాలనుకున్నా. పేరెంట్స్ మమ్మల్ని పూల్‌కు తీసుకువస్తున్నారు. ఇక్కడ కోచ్‌లు బాగా శిక్షణ ఇస్తున్నారు. సెలవుల్లో నాకు ఇష్టమైన స్విమ్మింగ్ నేర్చుకోవడం సంతోషంగా ఉంది.
– ఎస్. హర్షిక, 1వ తరగతి, కడప

తొలుత భయం వేసింది..



తొలుత స్విమ్మింగ్ అంటే భయంగా ఉండేది. క్రమేణా నాలో భయం పోయింది. దీంతో ఎంతో సంతోషంగా స్విమ్మింగ్ సాధన చేస్తున్నా. సెలవులను ఈ విధంగా సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉంది.
– జి. నందన, 8వ తరగతి, కడప

ఆరోగ్యానికి చక్కటి ఔషధం స్విమ్మింగ్



ఈత శరీరానికి చక్కటి వ్యాయామం అందిస్తుంది. కీళ్లనొప్పులు ఉన్నవారు సైతం చేయగలిగే సులువైన వ్యాయామం. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ స్విమ్మింగ్ నిపుణుల పర్యవేక్షణలో నేర్చుకోవాలి. – రాజేంద్ర, సీనియర్ కోచ్, వైఎస్ఆర్ క్రీడాపాఠశాల, కడప

లోకేష్ వెయ్యి రోజులు తిరిగినా ఫలితముండదు

– ఎమ్మెల్యే రాచమల్లు

కడప సెవెన్‌రోడ్స్ : యువగళం పేరుతో లోకేష్ వెయ్యి రోజులు పాదయాత్ర చేసినా అధికారంలోకి రావడం కల్ల అని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రొద్దుటూరు అభివృద్ధిపై కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్‌లతో చర్చించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిని చేయాలన్న తపన మినహా పాదయాత్రకు మరో ఉద్దేశ్యం ఏదీ లేదన్నారు. ప్రజల్లోకి వచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తమ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి రూ. లక్ష కూడా కేటాయించలేదన్నారు. ఆయన చేసిన ఎన్నికల వాగ్దానాల్లో ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. అర్హులైన పేదలకు ఇళ్లు, నిరుద్యోగ భృతి ప్రొద్దుటూరులో ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. దోమకాటు వల్ల విష జ్వరాలు ప్రబలి ఎంతో మంది మృతి చెందుతున్నారని, డ్రైనేజీ పనులకు రూ. 150 కోట్లు అడిగినా చంద్రబాబు ఒక్క పైసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. జగన్ అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కింద ఒక్కో రైతుకు రూ.13,500 ఇచ్చారని తెలిపారు. తన నియోజకవర్గంలో రూ. 160 కోట్లు డ్వాక్రా రుణం మాఫీ చేసిన ఘనత జగన్‌దేనన్నారు.

శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన ప్లస్ టు పాఠశాలల్లో రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు చేపట్టి జేఎల్, పీజీటీగా నియామకం చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఫౌండేషన్ ప్లస్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను నిర్వహించి జూనియర్ లెక్చరర్లుగా, పిజిటిలుగా నియామకాలు చేపట్టాల్సి ఉందన్నారు. అందుకు భిన్నంగా ఒక ఇంక్రిమెంట్ మంజూరు చేస్తూ స్కూల్ అసిస్టెంట్ హోదాలో ప్లస్‌టు బోధించాలనటం విడ్డూరంగా ఉందన్నారు. పలు మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుంతలపై తాత్కాలిక రక్షణ

సాక్షి ఎఫెక్ట్

కడప సిటీ : కడప నగర పరిధిలోని వై–జంక్షన్ పరిసర ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న గుంతలకు అధికారులకు తాత్కాలిక రక్షణ కల్పించారు. ఇక్కడి సమస్యలపై ‘ప్రమాదాలకు నిలయం వై–జంక్షన్’ అనే శీర్షికన ఈనెల 11వ తేదిన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ప్రమాదాలకు నిలయంగా మారిన డ్రైనేజీ గుంతలపై ప్రమాదాలు జరగకుండా ఐరన్ ఫ్రేమ్‌లను అమర్చి రక్షణ చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణ కారణంగా పూర్తిగా మరమ్మత్తులు చేయలేని పరిస్థితిలో వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



డ్రైనేజీ గుంతలపై ఐరన్ ఫ్రేమ్‌ను అమర్చిన దృశ్యం

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం: మండలంలోని పెద్దచెప్పలి సచివాలయ పరిధిలో మంగళవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషాచలపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన అందులో పేర్కొన్నారు.

ఉద్యోగులపై దాడి సరికాదు

కడప అర్బన్: కడప రిమ్స్ వైద్య కళాశాలలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఏ. శ్రీనివాసులుపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి దుర్భాషలాడుతూ, దాడి చేయడం అమానుషమని ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రవికుమార్ అన్నారు. సోమవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవనం ఆవరణలో ఏపీ ఎన్జీఓ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఏ. శ్రీనివాసులుపై ఈనెల 9న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఓ కారుణ్య నియామకం సంబంధించి ఒత్తిడి తీసుకొస్తూ దుర్భాషలాడుతూ దాడి చేశారన్నారు. ప్రజల కోసం అహర్నిశలు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై దాడి చేయడం సరికాదన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి వినతిపత్రాన్ని ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్, ఎస్‌పీఎం హెచ్‌ఓడి బి. గోపీ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఏపీ ఎన్జీఓల సంఘం సంయుక్త కార్యదర్శి జయలక్ష్మి, వెంగళరావు, నగర అధ్యక్షుడు కె. చిన్నయ్య పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం: కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ బాలాజీ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సీవీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరానికి ఐటీఐలో ఉన్న ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లలో సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన అందులో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98668 43395 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన అన్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

పెండ్లిమర్రి: మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి వేద పండితుల ఆధ్వర్యంలో ధ్వజారోహణం, మహాపూర్ణాహుతి వంటి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా జరిపారు.ఉత్సవాల సందర్భంగా ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య ప్రారంభించారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు ఆలయ కార్య నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఉత్సవాల సందర్భంగా వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

కమలాపురం: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు పెంపొందించుకోవాలని కమలాపురం శాఖా గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన సదస్సు లో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఆమె నీతి కథలు బోధించారు. అనంతరం విద్యార్థులకు డ్యాన్స్‌లో శిక్షణ నిచ్చారు.

అందుబాటులోకి అల్ట్రా మోడ్రన్ జిమ్

- రూ. 40 లక్షలతో ఆధునికీకరణ
- ప్రారంభించిన మేయర్ కె. సురేష్‌బాబు

కడప స్పోర్ట్స్: కడప నగర ప్రజలకు, క్రీడాకారులకు అల్ట్రా మోడ్రన్ జిమ్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కడప నగరపాలక సంస్థ సంయుక్త సహకారంతో దాదాపు రూ. 40లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జిమ్‌సెంటర్‌ను కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఆధునీకరించిన జిమ్‌సెంటర్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్.బి. అహ్మద్‌బాషా, డిప్యూటీ మేయర్ బి. నిత్యానందరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. శాప్ ఆధ్వర్యంలో రూ. 35 లక్షల విలువచేసే ట్రెడ్‌మిల్, బైసైకిల్స్, పెగ్‌డెక్, షోల్డర్ ప్రెస్ మిషన్స్, క్రాస్ ట్రైనర్, స్మిత్‌మిషన్, కాఫ్ మిషన్ తదితర క్రీడా సామగ్రిని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా ఒక్కో క్రీడాంశానికి ప్రాధాన్యత ఇస్తూ పూర్తి చేస్తూ వస్తున్నామన్నారు. అధునాతన పరికరాలతో తీర్చిదిద్దిన జిమ్ సెంటర్‌ను కడప నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలోనే స్కేటింగ్ రింక్‌ను సింథటిక్ ట్రాక్‌గా మార్పు చేస్తామని, స్టేడియం ఆవరణలో రెస్టారెంట్, స్పోర్ట్స్ స్టోర్స్ ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్చరీ క్రీడకు చోటు కల్పిస్తామని పేర్కొన్నారు. మధ్యలో నిలిచిపోయిన జిమ్నాస్టిక్స్ సెంటర్‌కు సంబంధించిన పనులు చేపట్టేందుకు అంచనాలు తయారుచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం మేయర్ స్కేటింగ్ రింక్‌ను పరిశీలించారు. వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్, స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్, కార్పొరేటర్లు సూర్యనారాయణ రావు, మల్లికార్జున కిరణ్, ఎస్ఎండీ షఫీ, కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



జిమ్‌సెంటర్‌లో వ్యాయామం చేస్తున్న మేయర్ తదితరులు

వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి

కడప కార్పొరేషన్: వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సులు తప్పక తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన మామిళ్లపల్లె, బుగ్గ అగ్రహారం, ఊటుకూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఇందిరానగర్ ప్రజలతో మాట్లాడి పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. పందులు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేయగా, పందుల యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, నీటి బోర్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. బాబా నగర్ రోడ్డులో ప్రజలు నడిచేందుకు పాత్‌వే పనులు చేపట్టాలన్నారు. ఊటుకూరులో చేపట్టే నూతనంగా నిర్మాణాలు చేపట్టే వారు ప్లాన్ తప్పక తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

‘స్పందన’లో ఫిర్యాదుల స్వీకరణ

కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ‘స్పందన’ కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గత సోమవారం వచ్చిన అర్జీల పరిష్కార వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్‌ఓ ప్రశాంత్‌వర్ధన్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం

కడప ఎడ్యుకేషన్: దేవుని కడపలో 2013లో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన 40 మంది విద్యార్థులకు టీం డీసీ (దేవుని కడప టీం)అనే స్వచ్ఛంద సంస్థ ఘనంగా సత్కరించింది. దేవుని కడపలోని సోమేశ్వరాలయ ఆవరణంలోని కళ్యాణమండపంలో టీం డీసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోమేశ్వరాలయ ప్రధాన అర్చకుడు మూర్తిస్వామి సీనియర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు సుబ్బయ్య, అనిల్‌కుమార్, డీఈఓ కార్యాలయ ఉద్యోగి ప్రవీణ్‌కుమార్, దేవుని కడప ప్రముఖులు ఆకుల నాగమురళీ హాజరై విద్యార్థులకు వివేకానంద సాహిత్యం పుస్తకంతోపాటు పెన్, మిఠాయిలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక విద్యార్థులను విద్యలో ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. టీం డీసీ సభ్యులు అడవుల నాగార్జున, అడవుల రాజేష్‌కుమార్, బండ శివకుమార్, వెంకటరమణ, వెంటకేస్‌బాబు, పత్తూరు సూర్యం పాల్గొన్నారు.



విద్యార్థికి వివేకానంద సాహిత్యం పుస్తకంతో పాటు పెన్, మిఠాయిని అందిస్తున్న అనిల్‌కుమార్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రాష్ట్రంలో 22 లక్షల మంది కార్మికులను నమోదు చేయించారని పేర్కొన్నారు. సంక్షేమ కార్డుల ద్వారా ఫలాలు అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వం వాడుకున్న రూ. 1600 కోట్లు వెంటనే సంక్షేమ బోర్డులో జమ చేయాలని కోరారు. ఇప్పటివరకు 32 వేల పైబడి క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు సంబంధించిన నిధులు వెంటనే మంజూరు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ సంక్షేమ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, జిల్లాప్రధాన కార్యదర్శి మద్దిలేటి, నాయకులు నాగిరెడ్డి, రామాంజనేయులు, బాలాజీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

సుస్థిర వ్యవసాయంతో లాభాలు

కడప ఎడ్యుకేషన్: సుస్థిర వ్యవసాయంతో రైతులు లాభాలను గడించవచ్చునని బెంగళూరు సీబీటీ డైరెక్టర్ డాక్టర్ సిరిల్ ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సుస్థిర పంట ఉత్పత్తి... లాభసాటి వ్యవసాయం అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సిరిల్ ప్రసన్నకుమార్ రైతులు వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడం, ఖచ్చితమైన లాభసాటి వ్యవసాయం, పంట నాణ్యత మెరుగుపరుచుకోవడం వంటి అంశాల గురించి వివరించారు. కళాశాల ప్రధానాచార్యులు వీఎస్‌మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమకుమార్, ఈసీఈ విభాగాధిపతులు డాక్టర్ హేమలత, ప్రోగ్రాం కన్వీనర్ వెంకటనారాయణ, సయన్వయకర్త అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిన్నారుల సందడి

కడప కల్చరల్ : కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయంలో సోమవారం చిన్నారుల సందడి కనిపించింది. బాలల వేసవి శిక్షణ శిబిరంలో నిర్వాహకులు శిక్షకుల ద్వారా పలు విభిన్నమైన కార్యక్రమాలను నిర్వహింపజేశారు. కథలు చెప్పడం, చెప్పించుకోవడం, అభిప్రాయాలు సేకరించడం, బొమ్మలు గీయడం, రంగులు అద్దడం, వేమన పద్యాలు నేర్పడం, కంఠస్థం చేయించడం, రాగయుక్తంగా ఆలపించడం తదితర అంశాలను శిక్షకులు నేర్పారు. ముఖ్యంగా పాటలు, కథలు, రంగుల చిత్రాలు గీయడం అంశాల్లో చిన్నారులు ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా శిబిరం శిక్షకులు జేడీ దేవదత్తం చిన్నారులకు దేశభక్తి గీతాలను నేర్పగా, మరో శిక్షకులు జేమ్స్ వేమన పద్యాలను నేర్పుతున్నారు. కడప నగరానికి చెందిన నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు ఈ సందర్భంగా శిక్షణకు హాజరవుతున్న విద్యార్థుల సౌకర్యార్థం 15 చాపలను అందజేశారు.



చాపలను అందజేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎస్ఎస్‌సీలో జిల్లా వాసి ప్రతిభ

కస్టమ్స్ ఎగ్జామినర్‌గా ఉద్యోగం

కడప ఎడ్యుకేషన్: కష్టపడితే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని నిరూపించాడీ కుర్రాడు. అనుకున్న లక్ష్యం కోసం అహర్నిశలు కష్టపడి చదివి చివరకు అనుకున్న ఉద్యోగం సాధించి భేష్ అనిపించుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. చెన్నూరు మండలం శివాలపల్లెకు చెందిన రైతు ముమ్మడి భాస్కర్‌రెడ్డి, లక్ష్మికాంతమ్మల కుమారుడు ముమ్మడి రవితేజరెడ్డి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో తన సత్తా చాటి జాతీయస్థాయిలో 3623 ర్యాంకు సాధించి కస్టమ్స్ ఎగ్జామినర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ అబ్బాయి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షకు సంబంధించి మొదటి ప్రయత్నంలో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించాడు. దాంతో తృప్తి పడలేదు. మళ్లీ రెండు, మూడోసారి రాసినా అనుకున్న పోస్టు రాలేదు. విక్రమార్కుడిగా నాలుగ ప్రయత్నం చేసి అనుకున్న కొలువును సాధించాడు. ప్రస్తుత స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఫలితాల్లో ర్యాంకు సాధించి కస్టమ్స్ ఎగ్జామినర్‌గా ఉద్యోగాన్ని సాధించాడు.



ముమ్మడి రవితేజరెడ్డి

ముగ్గురు మట్కా బీటర్ల అరెస్ట్

కడప అర్బన్: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మేకల దొడ్డి సమీపంలో ముగ్గురు మట్కా బీటర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 3 వేలు నగదును, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జయరాములు తెలియజేశారు.

• వ్యక్తిపై సెల్‌ఫోన్‌తో దాడి

కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పూసల వీధిలో ఉంటున్న పసల శ్రీనివాసులు, ఓ యువతిని కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. అతని తోడల్లుడు షేక్ షఫీ మద్యం సేవిస్తూ రోజూ తన భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో షఫీ భార్య ఈనెల 14న తన చెల్లెలింటికొచ్చింది. అదే సమయానికి షఫీ అక్కడికెళ్లి ఆమెపై దాడికి యత్నించాడు. పసల శ్రీనివాసులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా... షఫీ సెల్‌ఫోన్‌తో దాడి చేశాడు. దీంతో శ్రీనివాసులు నుదురుపై రక్తగాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రంగస్వామి తెలిపారు.

• యువకులకు కౌన్సెలింగ్

కడప టూటౌన్ ఎస్ఐ యు.వై జయరాములు సోమవారం సాయంత్రం యువకులకు, వాహనదారులకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు కాలుష్య ప్రమాణాలకు నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్ వాహనాల సైలెన్సర్‌లు మార్చి నడుపుతున్న వారికి జరిమానా విధించారు. బైక్‌ల సైలెన్సర్‌లను తీసేసి, శబ్దకాలుష్యానికి గురి చేసే ఇతర సైలెన్సర్‌లను వాడితే బైక్ సీజ్ చేస్తామనీ ఎస్ఐ హెచ్చరించారు.